తెలంగాణ రెగెట్టా టోర్నీ షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుసేన్‌సాగర్ వేదికగా 7వ తెలంగాణ రాష్ట్ర రెగెట్టా చాంపియన్‌షిప్ బుధవారం మొదలైంది. ఇందులో ఆతిథ్య హైదరాబాద్ సహా మహబూబ్‌నగర్, మేడ్చల్, నారాయణపేట, వికారాబాద్, వరంగల్ జిల్లాల నుంచి 59 ఎంట్రీలు వచ్చాయి. యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నీలో జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. బాలికల కేటగిరీలో దేశంలో టాప ర్యాంక్‌ల్లో కొనసాగుతున్న దీక్షిత కొమురవెల్లి, లాహిరి కొమురవెల్లితో పాటు బన్నీ(5 ర్యాంక్), మహమ్మద్ రిజ్వాన్(8 ర్యాంక్) బరిలోకి దిగుతున్నారు.

యోధాస్ గెలుపు బాట

కటక్: అల్టిమేట్ ఖో ఖో లీగ్‌లో తెలుగు యోధాస్ మళ్లీ గెలుపు బాట పట్టింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో యోధాస్ 38-28తో రాజస్థాన్ వారియర్స్‌పై అద్భుత విజయం సాధించింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు ఒక ఓటమితో యోధాస్ ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతున్నది. మ్యాచ్ విషయానికొస్తే..యోధాస్ తరపున రాహుల్ మండల్ 10 పాయింట్లతో కీలకంగా వ్యవహరించాడు. రాహుల్‌కు తోడు ప్రతీక్ వైకర్, ఆదిత్య..మ్యాట్‌పై నాలుగు నిమిషాలకు పైగా గడిపి బోనస్ పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు. మరో మ్యాచ్‌లో ఒడిశా జగర్‌నెట్స్ 31-28తో ముంబై ఖిలాడీస్‌పై గెలిచింది.

జాస్మిన్, అరుంధతి పసిడి ధమాకా

మహిళల జాతీయ బాక్సింగ్ టోర్నీ

గ్రేటర్ నోయిడా: మహిళల సీనియర్ జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జాస్మిన్ లంబోరియా, అరుంధతి, స్వీటీ బూర పసిడి పతకాలతో మెరిశారు. బుధవారం జరిగిన 60కిలోల ఫైనల్ పోరులో జాస్మిన్ 4-3తో ఒలింపియన్ సిమ్రన్‌జీత్‌కౌర్‌పై విజయం సాధించింది. వాస్తవానికి బౌట్ ఆసాంతం సిమ్రన్‌జీత్ ఆధిపత్యం ప్రదర్శించినా..రిఫరీలు మాత్రం జాస్మిన్ వైపు మొగ్గుచూపారు. దీనిపై మాజీ ఆసియా చాంపియన్ సిమ్రన్‌జీత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 66కిలోల విభాగంలో అరుంధతి 5-0తో అంక్షిత బొరోపై విజయం సాధించింది. ప్రపంచ చాంపియన్ స్వీటి బూర(81కి)..పూజారాణిపై గెలిచి తన టైటిల్ నిలబెట్టుకుంది.

రాహుల్ ఒక్కడే

1 సెంచూరియన్‌లో ఒకటి కంటే ఎక్కువ సెంచరీలు చేసిన తొలి విదేశీ బ్యాటర్‌గా రాహుల్ నిలిచాడు.

సూపర్ సెంచరీతో విజృంభణ • భారత్ తొలి ఇన్నింగ్స్ 245

డీన్ ఎల్గర్ అజేయ శతకం • దక్షిణాఫ్రికా 256/5

భారత్, దక్షిణాఫ్రికా బాక్సింగ్ డే టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. ప్రతికూల పరిస్థితుల మధ్య ఇరు జట్లు ఒకరిపై ఒకరు ఆధిక్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. సహచరులు విఫలమైన వేళ తాను ఉన్నానంటూ కేఎల్ రాహుల్ వీరోచిత శతకంతో చెలరేగిన వేళ భారత్ గౌరవప్రదమైన స్కోరు అందుకుంది. సెంచూరియన్‌లో మరో సెంచరీ ఖాతాలో వేసుకుంటూ సఫారీ పేసర్లకు రాహుల్ ఎదురొడ్డి నిలిచాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు భారత్‌కు దీటుగా సమాధానమిస్తున్నారు. డీన్ ఎల్గర్ సూపర్ సెంచరీతో కదంతొక్కడంతో దక్షిణాఫ్రికా స్వల్ప అధిక్యం దక్కించుకుని మ్యాచ్‌పై పట్టు బిగిస్తున్నది. మూడో రోజు ఆట మ్యాచ్‌లో విజేతను నిర్ణయించనుంది.

సెంచూరియన్: ఈసారైనా దక్షిణాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్ ముద్దాడుదామనుకున్న భారత్ ఆశలు అంత సులువుగా నెరవేరేలా కనిపించడం లేదు. ప్రతికూల పరిస్థితులకు పెట్టింది పేరైన సఫారీల గడ్డపై భారత్ ఇబ్బందులు పడుతున్నది. ఈ సిరీస్‌తో తన టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నానని ప్రకటించిన డీన్ ఎల్గర్(211 బంతుల్లో 140 నాటౌట్, 23 ఫోర్లు) సూపర్ సెంచరీతో దక్షిణాఫ్రికా 256/5 స్కోరు చేసింది. ఓపెనర్ మార్క్‌రమ్(5) ఆదిలోనే నిష్క్రమించినా..ఎల్గర్ తన అనుభవాన్ని చాటాడు. టీమ్ ఇండియా పేస్ దాడిని కాచుకుంటూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. టోనీ డీ జోర్జి(28)తో కలిసి ఎల్గర్ 93 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఎక్కడా తడబాటుకు లోనుకాకుండా భారత బౌలర్ల సహనానికి పరీక్ష పెడుతూ మైదానం నలువైపులా చూడచక్కని షాట్లతో అలరించాడు. తన సొంతమైదానంలో ఆడుతున్న ఎల్గర్ కెరీర్‌లో 14వ సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. బుమ్రా..వరుస ఓవర్లలో జోర్జి, పీటర్సన్(2)ను ఔట్ చేసినా..అరంగేట్రం బ్యాటర్ బెడింగ్‌హామ్(56) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. ఎల్గర్ అండగా బెడింగ్‌హామ్ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జత చేశాడు. బెడింగ్‌హామ్‌ను ఔట్ చేయడం ద్వారా ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని సిరాజ్ విడగొట్టాడు. దీంతో నాలుగో వికెట్‌కు 131 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఎల్గర్, జాన్సెన్ (3) క్రీజులో ఉన్నారు. బుమ్రా (2/48), సిరాజ్ (2/63) రెండేసి వికెట్లు తీశారు.

రాహుల్ సూపర్

సహచరులు విఫలమైన చోట..కేఎల్ రాహుల్ వీరోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 208/8 రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొన సాగించిన భారత్ 245 పరుగులకు ఆలౌటైంది. టెయిలెండర్లతో కలిసి రాహుల్ సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. ప్రతికూల వాతావరణంలో సఫారీ బౌలర్ల పేస్ బౌలింగ్‌కు ఎదురొడ్డి నిలుస్తూ కీలక పరుగులు సాధించాడు. కోట్జె బౌలింగ్‌లో కండ్లు చెదిరే సిక్స్ కొట్టిన రాహుల్ తన కెరీర్‌లో ఎనిమిదో సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. సెంచూరియన్‌లో రెండో సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. పేస్ స్వర్గధామమైన సూపర్ స్పోర్ట్ పార్క్‌లో రాహుల్ సెంచరీ అత్యుత్తమ టెస్టు ఇన్నింగ్స్‌లో ఒకటిగా నిలిచిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. రెండు వందల పరుగుల లోపు పరిమిత మవుతుందనుకున్న టీమ్‌ఇండియా రాహుల్ సెంచరీతో గౌరవప్రదమైన స్కోరు అందుకుంది.

ఎల్గర్ *(140*)*

2 ఎస్‌ఈఎన్‌ఏ(దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా)లో పంత్ తర్వాత సెంచరీలు చేసిన రెండో భారత వికెటీకీపర్‌గా రాహుల్ నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 245 ఆలౌట్(రాహుల్ 101, కోహ్లీ 38, రబడ 5/59, బర్గర్ 3/50), **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 256/5(ఎల్గర్ 140 నాటౌట్, బెడింగ్‌హామ్ 56, బుమ్రా 2/48, సిరాజ్ 2/63).

3 దక్షిణాఫ్రికాలో టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన వారిలో రాహుల్(2) మూడో స్థానంలో ఉన్నాడు.

రాహుల్ *(101)*

బంగ్లా భళా

తొలి టీ20లో కివీస్‌పై విజయం

నేపియర్: న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. న్యూజిలాండ్‌లో న్యూజిలాండ్‌పై టీ20ల్లో గెలువడం బంగ్లాకు ఇదే తొలిసారి. తొలుత కివీస్ 20 ఓవర్లలో 134/9 స్కోరు చేసింది. షరీఫుల్(3/26), మెహదీహసన్(2/14), రెహమాన్(2/15) రాణించారు. నీషమ్(48) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు బంగ్లా 18.4 ఓవర్లలో 137/5 స్కోరు చేసింది. ఓపెనర్ లిటన్ దాస్(42 నాటౌట్), సౌమ్య సర్కార్(22) రాణించారు.

పాక్ 194/6

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మధ్య బాక్సింగ్ డే టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్(3/37), లియాన్(2/48) ధాటికి పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 194 పరుగులు చేసింది. ఓపెనర్ అబ్దుల్ షఫీక్(62), కెప్టెన్ షాన్ మసూద్(54) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. కమిన్స్ ధాటికి ఇమామ్ హక్(10), బాబర్ ఆజమ్(1), సౌద్ షకీల్(9), సల్మాన్(5) స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. అంత కుముందు ఓవర్‌నైట్ స్కోరు 187/3 రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ 318 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్(63) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు.

చెస్ చాంప్ భరత్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రగతినగర్ పుచ్చలపల్లి సుందరయ్య ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన మార్వెల్ ఆల్‌ఇండియా ఫిడే చెస్ టోర్నీలో భరత్‌కుమార్‌రెడ్డి విజేతగా నిలిచాడు. బుధవారం జరిగిన ఫైనల్ రౌండ్‌లో బద్రీనాథ్‌తో గేమ్‌ను భరత్ డ్రా చేసుకున్నాడు. దీంతో తొమ్మిది రౌండ్లలో భరత్ 8 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. రాయ్ చౌదరీ, కర్తవ్య వరుసగా రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నారు.

ముగ్గురు సభ్యులతో కమిటీ

న్యూఢిల్లీ: జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ) రోజువారీ కార్యకలాపాల కోసం భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఇందులో భూపిందర్‌సింగ్ బాజ్వా, ఎమ్ఎమ్ సోమయ, మాజీ షట్లర్ మంజుష కన్వర్ ఉన్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య(ఐవోసీ) నిబంధనలకు విరుద్ధంగా టోర్నీలు నిర్వహించేందుకు సిద్ధమైనందువల్లే డబ్ల్యూఎఫ్ఐని రద్దు చేశామని ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

భారత్ X ఆసీస్

ముంబై: టెస్టుల్లో వరుసగా రెండు చరిత్రాత్మక విజయాలతో జోరుమీదున్న భారత మహిళా క్రికెట్ జట్టు వన్డే పోరుకు సిద్ధమైంది. బుధవారం ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా తొలి వన్డే మ్యాచ్ ఆడనుంది. ఏకైక టెస్టులో ఆసీస్‌ను మట్టికరిపించిన హర్మన్‌ప్రీత్‌కౌర్ సేన..అదే జోరు కొనసాగించాలని పట్టుదలతో ఉంది. ఇప్పటి వరకు ఆసీస్‌తో 50 వన్డేలాడిన భారత్..పది విజయాలకు మాత్రమే పరిమితమైంది.

సెన్సెక్స్ @ 72,000

చరిత్రాత్మక రికార్డుస్థాయిలకు సూచీలు
నాలుగో రోజూ అదరగొట్టిన మార్కెట్

ముంబై, డిసెంబర్ 27: అంతర్జాతీయ ట్రెండ్ సానుకూలత, దేశీయ ఆర్థిక ఫండమెంటల్స్ బలపడుతున్న సంకేతాలతో భారత స్టాక్ మార్కెట్ మరో కొత్త చరిత్ర సృష్టించింది. వరుసగా నాలుగో రోజూ బలమైన ర్యాలీ జరిపింది. బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ తొలిసారిగా 72,000 పాయింట్ల శిఖరాన్ని అధిరోహించింది. తాజాగా 702 పాయింట్లు పెరిగిన ఈ సూచి 72,038 పాయింట్ల వద్ద ముగిసింది. ఇదేబాటలో ఎన్ఎస్ఈ నిఫ్టీ 21,600 పాయింట్లస్థాయిని మొదటిసారిగా దాటేసింది. 213 పాయింట్ల భారీలాభంతో 21,655 పాయింట్ల వద్ద ముగిసింది. గతవారం ప్రధమార్థంలో చవిచూసిన నష్టాల నుంచి మార్కెట్ సులభంగా కోలుకోవడమే కాకుండా కొత్త రికార్డుస్థాయిల్ని చేరిందని, అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం తగ్గుతున్న కారణంగా యూఎస్ ఫెడరల్ రిజర్వ్ త్వరలోనే వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న ఆశాభావంతో శాంటా ర్యాలీ జరుగుతున్నదని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. డిసెంబర్ డెరివేటివ్ కాంట్రాక్టులు గురువారం ముగియనున్నందున, మార్కెట్లో కొంతమేర ఒడిదుడుకులు చోటుచేసుకోవచ్చని హెచ్చరించారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) బుధవారం రూ.2,926 కోట్ల నికర పెట్టుబడులు చేయగా, దేశీయ ఫండ్స్ రూ. 192 కోట్ల స్వల్ప విక్రయాలు జరిపినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల ప్రాథమిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

అల్ట్రాటెక్ సిమెంట్ టాప్

తాజా ర్యాలీలో సెన్సెక్స్ షేర్లలో అన్నింటికంటే అధికంగా అల్ట్రాటెక్ సిమెంట్ 4.23శాతం ఎగిసింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్, భారతి ఎయిర్‌టెల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లార్సన్ అండ్ టూబ్రో, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు 1-3 శాతం మధ్య లాభపడ్డాయి. మరోవైపు ఎన్టీపీసీ, టెక్ మహీంద్రాలు స్వల్పంగా నష్టపోయాయి. మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లకు సైతం కొనుగోలు మద్దతు లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.41 శాతం బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0. 20 శాతం చొప్పున పెరిగాయి.వివిధ రంగాల సూచీల్లో భారీగా మెటల్, ఆటో ఇండెక్స్‌లు 1.33 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. కమోడిటీస్ ఇండెక్స్ 1.19 శాతం, టెక్ సూచి 0.96 శాతం, ఐటీ ఇండెక్స్ 0.68 శాతం, కన్జూమర్ డ్యూరబుల్స్ సూచి, క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్‌లు 0.67 శాతం శాతం చొప్పున పెరిగాయి. యుటిలిటీస్, పవర్, సర్వీసుల సూచీలు నష్టపోయాయి.

ప్రపంచ మార్కెట్లు పాజిటివ్

యూఎస్ మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిసి, బుధవారం కడపటి సమాచారం అందేసరికి పాజిటివ్‌గా ట్రేడవుతున్నాయి. అమెరికా సూచీల్లో ఇప్పటికే నాస్‌డాక్, డోజోన్స్‌లు ఆల్‌టైమ్ రికార్డుస్థాయిని చేరగా, కీలకమైన ఎస్ అండ్ పీ-500 ఇండెక్స్ 2 శాతం దూరంలో ఉన్నది. ఇక ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్‌లు లాభాలతో ముగిసాయి. యూరప్‌లోని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ మార్కెట్లూ పెరిగాయి.

పీఎస్‌యూ బ్యాంక్‌లు బుల్లిష్

బుల్స్ పార్టీలోకి పీఎస్‌యూ బ్యాంక్‌లు కాస్త ఆలస్యంగా చేరాయని, ప్రస్తుత ట్రేడింగ్ శ్రేణి నుంచి అవి బ్రేక్‌అవుట్ చేసే అవకాశాలున్నాయని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ టెక్నికల్ హెడ్ రాహుల్ శర్మ అంచనా వేశారు. పీఎస్‌యూ బ్యాంక్‌లు ప్రస్తుతం పటిష్టంగా కన్సాస్తున్నాయని, ప్రైవేట్ బ్యాంక్‌లు క్యాచ్‌అప్ చేసే ఛాన్స్ ఉన్నదని చెప్పారు. విదేశీ ఇన్వెస్టర్లు గత రెండు సెషన్లుగా ఇండెక్స్ ఆప్షన్లను కొంటున్నారని, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో లాంగ్ పొజిషన్లు కొనసాగిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో గురువారం సైతం నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీలు పెరుగుతాయని అంచనా వేశారు.

4 రోజుల్లో
రూ. 11 లక్షల కోట్లు

వరుసగా నాలుగు ట్రేడింగ్ రోజుల్లో జరిగిన మార్కెట్ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద భారీగా రూ.11.11 లక్షల కోట్ల మేర పెరిగింది. బీఎస్ఈలో లిస్టయిన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ గత గురువారం నుంచి ఈ బుధవారం వరకూ రూ.11,11,599 కోట్లు పెరిగి రూ.3,61,31,598 కోట్లకు చేరింది.

వాణిజ్య

బుల్‌రన్‌తో ఎల్ఐసీకి లాభాల పంట

ఏడాదిలో రూ.2.3 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 27: మార్కెట్ బుల్‌రన్‌తో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) లాభాల పంట పండింది. ఐపీవో ధరతో పోలిస్తే ఎల్ఐసీ షేరు విలువ ఇప్పటికీ వెనుకపడే ఉన్నప్పటికీ, ఈక్విటీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న దిగ్గజ షేర్లతో 2023లో సంస్థ రూ.2.8 లక్షల కోట్ల భారీ లాభాన్ని ఆర్జించగలిగింది. ఎల్ఐసీకి దేశంలోని దాదాపు 260 లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడులు ఉన్నాయి. నిరుడు డిసెంబర్‌లో 9.61 లక్షల కోట్లు ఉన్న ఈక్విటీ పోర్ట్‌ఫోలియో విలువ రూ.11.89 లక్షల కోట్లకు పెరిగింది. ఏడాదికాలంగా నిఫ్టీ 18 శాతం పెరగడంతో ఎల్ఐసీ వద్దనున్న నిఫ్టీ-50 షేర్లే భారీ రాబడుల్ని అందించాయి. అన్నింటికంటే అధికంగా లార్సన్ అండ్ టూబ్రో రూ.16 వేల కోట్ల లాభాన్ని ఇవ్వగా, కోల్ ఇండియా రూ.10 వేల కోట్లకుపైగా రాబడినిచ్చింది. సంస్థకు భారీ లాభాల్ని ఇచ్చిన టాప్-ఫైవ్ షేర్లలో ఈ రెండింటితో పాటు ఎన్టీపీసీ, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లు ఉన్నాయి.

ఆటో ధరలు పెంచిన పియాజియో

పూణె, డిసెంబర్ 27: ఇటలీకి చెందిన ఆటో దిగ్గజం పియాజియో కూడా తన వాహన ధరలను పెంచింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల వాహన ధరలను రూ.6 వేల వరకు సవరిస్తున్నట్టు తెలిపింది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో డీజిల్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ, పెట్రోల్ రకాల్లో లభించనున్న కార్గో, ప్యాసింజర్ అపే ఆటోలు రూ.6 వేల వరకు ప్రియం కానున్నాయి.

అరబిందో మరో మందుకు అమెరికా ఓకే

హైదరాబాద్, డిసెంబర్ 27: అరబిందో అనుబంధ సంస్థయైన యుజియా ఫార్మా స్పెషాల్టీ లిమిటెడ్‌కు చెందిన మరో ఔషధానికి అమెరికా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సంస్థ తయారు చేసిన తీవ్రమైన ఫంగల్ ఇన్ఫెక్షన్‌ను నివారించే పోసాకోనాజోల్ ఇంజెక్షన్‌ను అక్కడి మార్కెట్లో తయారు చేయడానికి, విక్రయించడానికి అమెరికా హెల్త్ రెగ్యులేటర్‌కు అనుమతినిచ్చింది. ఈ పోసాకోనాజోల్ ఇంజెక్షన్ 300 ఎంజీ/16.7 ఎంఎల్ సింగిల్ డోజ్‌లో లభించనున్నదని కంపెనీ పేర్కొంది.

ఎస్బీఐ డిపాజిట్లపై వడ్డీ పెంపు

అర శాతం వరకు పెంచిన సంస్థ



హైదరాబాద్, డిసెంబర్ 27: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) డిపాజిట్‌దారులకు శుభవార్తను అందించింది. రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేట్లను అర శాతం వరకు సవరించింది. ఎస్బీఐ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం పెరిగిన వడ్డీరేట్లు బుధవారం నుంచి అమలులోకి వచ్చాయి. పది నెలల తర్వాత వడ్డీరేట్లను పెంచడం విశేషం. చివరిసారి ఫిబ్రవరి 2023లో డిపాజిట్లపై వడ్డీరేట్లను సవరించింది. దీంతో 7 రోజుల నుంచి 45 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్లు సవరించడంతో వడ్డీరేటు 3 శాతం నుంచి 3.50 శాతానికి చేరుకున్నది. అలాగే 46 నుంచి 179 రోజుల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును పావు శాతం పెంచిన బ్యాంక్..180 నుంచి 210 రోజుల లోపు డిపాజిట్లపై రేటుని కూడా పావు శాతం సవరించింది.

ఎస్బీఐ అమృత్ కలశ్ స్కీం కాలపరిమితి పెంపు

ప్రతిష్ఠాత్మకంగా ఎస్బీఐ బ్యాంక్ జారీ చేసిన ఎస్బీఐ అమృత్ కలశ్ స్కీం కాలపరిమితిని వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగించింది. 400 రోజుల కాలపరిమితి కలిగిన ప్రత్యేక డిపాజిట్ స్కీంపై 7.10 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. అలాగే సీనియర్ సిటిజన్లకు 7.60 శాతం వడ్డీని చెల్లిస్తున్నది.

ఎఫ్‌డీలపై ఎస్బీఐ వడ్డీరేట్లు(శాతంలో)

కాలపరిమితి	జనరల్	సీనియర్ సిటిజన్లు
7-45 రోజులు	3.5	4
46-179 రోజులు	4.75	5.25
180-210 రోజులు	5.75	6.25
211-ఏడాది	6	6.5
1-2 ఏండ్లు	6.8	7.3
2-3 ఏండ్ల వరకు	7	7.5
3-5 ఏండ్ల వరకు	6.75	7.25
5-10 ఏండ్ల వరకు	6.5	7.50

పెరిగిన బ్యాంకింగ్ మోసాలు

ముంబై, డిసెంబర్ 27: బ్యాంకింగ్ రంగంలో మోసాలను అరికట్టడానికి రిజర్వ్‌బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ సత్ఫలితాలను ఇవ్వడం లేదు కదా అంతకంతకు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో బ్యాంకింగ్ రంగంలో 14,483 మోసాలు జరిగాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో జరిగిన మోసాల కంటే ఇది 14.9 శాతం అధికమని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2022-23 నివేదికలో వెల్లడించింది. సంఖ్య పరంగా చూస్తే భారీగా పెరిగినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం భారీగా తగ్గాయి. ఏడాది క్రితం ఆరు నెలల్లో 5,396 మోసాలు జరుగగా, వీటి విలువ రూ.17,685 కోట్లు. ఈసారి 14,484 మోసాలు జరిగితే వీటి విలువ రూ.2,642 కోట్లు అని పేర్కొంది.

1.50 లక్షల కోట్లకు పీఎస్‌బీ లాభాలు

2023 బిజినెస్ రివ్యూ

దేశీయ బ్యాంకింగ్ రంగానికి మంచి రోజులు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.1.50 లక్షల కోట్ల మేర లాభాలు ఆర్జించవచ్చును. దేశ ఆర్థిక పరిస్థితులు కోలుకోవడం ఇందుకు కారణమని విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో రూ.68,500 కోట్ల లాభాలను ఆర్జించిన పీఎస్‌బీలు మిగతా ఆరు నెలల్లో కూడా ఇంతే స్థాయిలో ఆర్జించవచ్చునని పేర్కొంది. రుణాలకు డిమాండ్ పెరగడం, నిరర్థక ఆస్తులు తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌బీలు రూ.1.04 లక్షల కోట్ల మేర లాభాలను ఆర్జించిన విషయం తెలిసిందే. ఎన్‌పీఏలు తగ్గుముఖం పట్టడం, రుణాలకు డిమాండ్, అధిక వడ్డీరేటు కారణంగా వచ్చే త్రైమాసికాల్లో బ్యాంకులు లాభాలు మరింత పెరగడానికి దోహదం చేయవచ్చునని పేర్కొంది.

ఐసీఐసీఐ లైఫ్‌కు 270 కోట్ల జీఎస్టీ నోటీసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 27: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను మహారాష్ట్ర జీఎస్టీ ఆథార్టీ రూ.270 కోట్ల జీఎస్టీ నోటీసులిచ్చింది.ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, జీఎస్టీఆర్-1, జీఎస్టీఆర్-9, ఐటీసీ క్లెయింలో అంతరాలు, జీఎస్టీఆర్-3బీ, జీఎస్టీఆర్-2ఏ, డిపాజిట్లపై జీఎస్టీ చెల్లింపుల పొంతన లేకుండా ఉన్నాయని ఆరోపించింది. రూ.269.86 కోట్ల నోటీసులో జీఎస్టీ కింద రూ.119.56 కోట్లు కాగా, వడ్డీలు రూ.138.34 కోట్లు, పెనాల్టీ రూపంలో రూ.11.95 కోట్లు విధించింది.

మళ్లీ రూపీ డౌన్

ముంబై, డిసెంబర్ 27: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మళ్లీ క్షీణించింది. బుధవారం ఒక్కరోజే ఏకంగా 15 పైసలు దిగజారి 83.34 వద్దకు పడిపోయింది. దేశం నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులతో పాటు బ్యాంకులు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరుగుతున్న డిమాండ్.. రూపాయిని దెబ్బతీసింది. ఈ క్రమంలోనే దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో కదలాడినా ఆ ప్రభావం ఫారెక్స్ మార్కెట్‌పై పడలేదని ట్రేడర్లు చెప్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల ఒడిదుడుకులపై మదుపరుల్లో ఆందోళనలు, ఎర్ర సముద్ర మార్గంలో సాగే అంతర్జాతీయ వర్తక లావాదేవీల్లో అంతరాయం సైతం రూపీని కోలుకోకుండా చేశాయని వారు అభిప్రాయపడుతున్నారు. ఇక బుధవారం ట్రేడింగ్‌లో ఒకానొక దశలో రూపీ విలువ 83.20 స్థాయికి కోలుకోగా, మరోసారి 83.35కు పతనమైంది. చివరకు 83.34 వద్ద నిలిచింది. దీంతో మంగళవారం నాటి ముగింపుతో పోల్చితే 15 పైసలు నష్టపోయినట్టైంది. మంగళవారం సైతం 3 పైసలు పడిపోయిన విషయం తెలిసిందే. దీంతో వరుస రెండు రోజుల్లో 18 పైసల విలువను రూపీ దిగజార్చుకున్నట్టైంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40